
సాక్షి
ఒడిశా

ఆదివారం । 9 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,77,000
బంగారం	50 మిల్లీ గ్రాములు
వెండి	26 గ్రాముల 950 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



వీడని ఉత్కంఠ

రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు వచ్చి నాలుగు రోజులైనా బీజేపీ కొత్త ముఖ్యమంత్రి పేరుపై ఇంకా ప్రకటించకపోవడంతో ఉత్కంఠ నెలకొంది.

- 8లో



మొక్కలతోనే జీవరాశి మనుగడ

మొక్కలతోనే జీవరాశి మనుగడ ముడిపడి ఉందని బొరిగుమ్మ ఏడీపీ దీక్షిత్ కుమార్ నాయిక్ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

కొలువుదీరిన గంగమ్మ ఘటాలు



అమ్మవారి ఘటాలు

రాయగడ: స్థానిక పిట్టలవీధిలో శుక్రవారం నుంచి ప్రారంభమైన అగ్ని గంగమ్మ అమ్మవారి పండగలో భాగంగా శనివారం అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలు కొలువుదీరాయి. ఘటాలకు ముస్తాబు చేసి సాయంత్రం పురవీధుల్లో ఊరేగిస్తారు. దీనినే ఘటాల తిరువీధుగా పిలుస్తారు. ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేవారితో మందిరం సందడిగా మారింది. బుధవారంతో పండగ ముగుస్తుంది.

సత్తాచాటిన శ్రీవాణి



శ్రీవాణి

జయపురం: పట్టణానికి చెందిన గెంబలి శ్రీవాణి నీట్ పరీక్షలో సత్తాచాటింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 16 వేల ర్యాంక్ సాధించింది. దీంతో ఆమెను జయపురం కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు గెంబలి వసంతరావుతో పాటు సంఘ సభ్యులు అభినందించారు. కొరాపుట్ జిల్లాకే ఆమె గర్వకారణమని కొనియాడారు.

పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



రైలు పట్టాలపై మృతదేహం

రాయగడ: స్థానిక పితామహల్ సమీపంలో ట్రెన్ పట్టాలపై ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టాలపై మృతదేహం పడి ఉందన్న సమాచారం మేరకు పోలీసులు శనివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. చారల చొక్కా, నీలం రంగు జీన్ ఫ్యాంట్ ధరించాడు. వయసు సుమారు 48 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత



అరెస్టైన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

పర్లాకిమిడి: గంజాం జిల్లా గుసాని సమితి నువాగాం పోలీసులు శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ జరుపుతుండగా చెరువుల చేపల వీధిలో సరస్వతీ శిశు మందిర్ విద్యాలయం వద్ద ఇద్దరు కారులో వచ్చి గంజాయి అన్‌లోడ్ చేస్తున్న సమాచారం అందుకొని ఒకరిని అరెస్టు చేశారు. కారులో 24 కిలోల 180 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి గజపతి జిల్లా క్రిస్టియన్ వీధికి చెందిన రోహాన్ కుమార్ మల్లిని అరెస్టు చేసి పోలీసులు కోర్టుకు తరలించారు.

ఉప్పలాడలో ఆందోళన



ఆందోళన చేపడుతున్న మహిళలు

పర్లాకిమిడి: గుసాని సమితి ఉప్పలాడ గ్రామంలో శనివారం ఉదయం మహిళలు బిందెలు రోడ్డుకు అడ్డంగా పెట్టి రస్తారోకో చేపట్టారు. గత ఆరు నెలలుగా ఉప్పలాడ గ్రామానికి ఓవర్ హెడ్ ట్యాంకు నుండి తాగునీరు సరఫరా కావడం లేదు. దీనిపై పర్లాకిమిడి గ్రామీణ తాగునీరు, శానిటేషన్ అధికారులకు ఎన్ని వినతులు అందజేసినా పట్టించుకోవడం లేదు. దీంతో రోడ్డుపై ఆందోళన చేపట్టారు. దాదాపు గంటసేపు మహిళలు రస్తారోకో చేసిన తర్వాత పోలీసుల విజ్ఞప్తి మేరకు ఆందోళన విరమించారు. ఆందోళనతో ఆర్.ఉదయగిరి, మోహనా నుండి వచ్చిన పలు బస్సులు నిలిచిపోయాయి.

నవీన్ వారసుడెవరు..?

- రాజకీయ శిబిరాల్లో ఊహాగానాలు
- నగరానికి చేరిన నవీన్ అన్న కొడుకు అరుణ్
- అతడే వారసుడని సర్వత్రా చర్చనీయం

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవలి జరిగిన ఎన్నికల్లో బిజు జనతా దళ్ (బీజేడీ) పరాజయం తర్వాత ముఖ్యమంత్రిగా నవీన్ పట్నాయక్ 24 ఏళ్ల సుదీర్ఘ సుస్థిర పాలనకు తెర పడింది. ఈ ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రధానంగా నవీన్ పట్నాయక్ అనంతర బాధ్యతలు స్వీకరించేందుకు బీజేడీ సారథిగా ఎవరు పగ్గాలు చేపడతారనే ప్రశ్న ప్రముఖుల విశ్లేషణల్లో గింగుర్లు కొడుతోంది. ఈ నేపథ్యంలో నవీన వ్యూహంపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. నవీన్ పట్నాయక్ వైఖరిని తేలికగా పసి గట్టడం అసాధ్యం. సుదీర్ఘ పాలనలో ఎన్నో సంక్లిష్ట పరిస్థితులను ఎవరికీ అంతు చిక్కని రీతిలో అవలీలగా అధిగమించిన దాఖలాలు కోకొల్లలు. ఆయన తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో తదుపరి వారసుడు విషయంలో బీజేడీ ఏకగ్రీవ ఆమోదంతో ఈ నిర్ణయం ఖరారు అవుతుందని తరచూ ప్రకటిస్తున్నారు. మరోవైపు ఇటీవల బహిరంగంగా తారసపడిన పలు సందర్భాలు, పరిస్థితుల నేపథ్యంలో ఆయనకు అత్యంత సన్నిహిత, విశ్వసనీయునిగా చలామణి అయిన వి.కార్తికేయ పాండియన్ తదుపరి రాజకీయ వారసుడు అనే వ్యాఖ్యలను బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ తోసి పుచ్చారు. ఈ పరిస్థితులో తన అన్న ప్రేమ్ పట్నాయక్ కుమారుడు అరుణ్ పట్నాయక్ నగరానికి చేరాడు.

వీకే పాండియన్ ప్రత్యక్షం

ఎన్నికల ఫలితాలు వెల్లడి కావడంతో నవీన్ పట్నాయక్ వ్యూహకర్తగా గుర్తింపు పొందిన వి.కె.పాండియన్ తెరమరుగు అయినట్లు పుకార్లు రాజ్యం ఏలాయి. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని నవీన్ పట్నాయక్ ప్రకటించారు. ప్రత్యర్థి వర్గాలు గాలి కబుర్లతో కాలక్షేపం చేస్తున్న తరుణంలో వి.కె. పాండియన్ బీజేడీ అధ్యక్షుడు అన్న కొడుకు అరుణ్ పట్నాయక్‌తో ప్రత్యక్షమై అవాక్కు చేశారు. దీంతో ప్రత్యర్థుల పుకారుల సరికొత్త మలుపు తీసుకున్నాయి. నవీన్ పట్నాయక్ వారసునిగా ఆయన అన్న కొడుకు రాష్ట్ర రాజకీయాల్లోకి రంగ ప్రవేశం చేస్తున్నట్లు కొత్త ఊహాగానాలు ఊపందుకున్నాయి.

నవీన్ నివాస్‌లో అరుణ్ పట్నాయక్

అరుణ్ పట్నాయక్ శుక్రవారం సాయంత్రం భువనేశ్వర్ చేరుకుని నవీన్ నివాస్‌లో బస చేశారు. నవీన్ నివాస్‌కు అతని ఊహించని సందర్శన, అతను నవీన్ వారసుడు కావచ్చు అనే ఊహాగానాలతో రాజకీయ శిబిరాలు కుతకుతలాడుతున్నాయి. నవీన్ అన్నయ్య ప్రేమ్ పట్నాయక్ కుమారుడు అరుణ్ పట్నాయక్ సీనియర్ బీజేడీ నాయకుడు కార్తీక్ పాండియన్‌తో కలిసి రావడం మరింత వాడివేడి చర్చలకు ప్రాణం పోసింది. వీరు ఇరువురినీ బిజూ జనతా దళ్ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్ విమానాశ్రయం నుంచి స్వాగతం పలికి ముగ్గురూ కలిసి ప్రత్యక్షంగా నవీన్ నివాస్‌కు చేరారు. అరుణ్ పట్నాయక్ రాజకీయ అరంగేట్రం చేస్తారనే ఊహాగానాలు జోరందుకున్నాయి.



భువనేశ్వర్ చేరిన నవీన్ పట్నాయక్ అన్న కొడుకు అరుణ్ పట్నాయక్ (ఎడమ వైపు వ్యక్తి)

లోతైన దృక్పథం

లోతైన దృక్పథంతో నవీన్ పట్నాయక్ ప్రతిమాట బహిరంగపరచడం ఆనవాయితీగా కొనసాగారు. మిత వాక్కు, మృదు స్వభావంతో ప్రత్యర్థులకు ఊహాతీతమైన కార్యాచరణతో ఖంగు తినిపించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యగా రుజువు చేసుకున్నారు. ఇటీవలి రాజకీయ పరిణామాల దృష్ట్యా బీజేడీ తదుపరి సారథిపై అత్యంత అల్పంగా ప్రతిస్పందించిన నవీన్, తన వంశీకులను రంగంలోకి దింపే యోచన లేనట్లు వ్యక్తీకరించకుండా, బీజేడీ ఏకగ్రీవ అభిమత వ్యక్తి సారథిగా పగ్గాలు చేపడతారని పరోక్షంగా సూచించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వి.కె.పాండియన్‌తో అరుణ్ పట్నాయక్ ప్రత్యక్షం కావడం బీజేడీ వర్గీయులు ప్రకటించక ముందే ప్రత్యర్థి వర్గాలు, రాజకీయ విశ్లేషకుల వర్గం అరుణ్ పట్నాయక్ తదుపరి బీజేడి సారథి కానున్నారని ప్రచారం చేయడం గమనార్హం.

ఓదార్పు రాక

ఇటీవల ముగిసిన ఎన్నికల్లో నవీన్ పట్నాయక్ రాష్ట్ర రాజకీయాల్లో తొలిసారిగా ఓటమి చవి చూశారు. ఈ ఆందోళనకర పరిస్థితుల్లో బాబాయ్‌ని అక్కున చేర్చుకుని ఓదార్చేందుకు అరుణ్ పట్నాయక్ విచ్చేసినట్లు ఊహాగానాలు వ్యాప్తిలో ఉన్నాయి. రాష్ట్ర రాజధానిలో కొద్దికాలం బస చేసి అరుణ్ ఢిల్లీకి తిరిగి వెళ్లిపోతారని కొంత మంది అభిప్రాయపడుతున్నారు. అరుణ్ పట్నాయక్ బీజేడీ తదుపరి వారసుడు అనే అంచనాలు సుమారు దశాబ్దం కిందటి నుంచి ప్రచారంలో ఉన్నాయి. 2014 సంవత్సరంలో బీజేడీ అసమ్మతివాదంతో సమస్యాత్మక పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న తరుణంలో తొలిసారిగా అరుణ్ పట్నాయక్ బీజేడీ శిబిరంలో తళుక్కుమన్నారు. దివంగత వ్యవసాయ శాఖ మంత్రి ప్రదీప్ మహారథి బీజేడీలో చేరాలని నిర్ణయించుకుంటే, అరుణ్ పట్నాయక్‌కు పూర్తిగా మద్దతు ఇస్తానని అప్పట్లో బహిరంగంగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజా ఎన్నికల ఫలితాల తర్వాత బీజేడీ ఘోర వైఫల్యం తర్వాతి విపత్కర పరిస్థితుల్లో అరుణ్ పట్నాయక్ మరోసారి ప్రత్యక్షం కావడంతో వారసత్వం శీర్షిక ప్రచారాలు రెక్కలు తొడుగుకున్నాయి. అయితే అరుణ్ అప్పట్లో నాకు ప్రస్తుతం రాజకీయాల్లో చేరే ఉద్దేశం లేదని ప్రకటించి వర్తమాన పరిస్థితుల్లో ప్రత్యక్షమై ఆనాటి భావ వ్యక్తీకరణకు పదును పెడుతున్నట్లు స్పష్టం అవుతుంది. రాజకీయ విపత్కర పరిస్థితులతో వయో భారంతో కొనసాగుతున్న నవీన్ పట్నాయక్ వారసుడుని అతి త్వరలో ఖరారు చేయడం తథ్యమనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. బీజేడీ ఏకగ్రీవ అంగీకారం కోసం లోపాయికారీ ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నట్లు ఎన్నికల ఫలితాల తదనంతర సమావేశాలు పరోక్షంగా సంకేతాలు బలపరుస్తున్నాయి. బీజేడీ వర్గీయులకు క్రమంగా కొత్త వారసుని పట్ల ఏకాభిప్రాయం బలోపేతానికి నవీన్ పట్నాయక్ ప్రత్యక్షంగా సారథ్యం వహిస్తున్నారు.

కృష్ణచంద్ర గజపతి పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్

పర్లాకిమిడి: స్థానిక హైస్కూల్ వద్దనున్న విశ్వనాథ్ ఫంక్షన్ హాల్‌లో పర్లాకిమిడి మహారాజు కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ చరిత్రపై రచయిత పూర్ణ చంద్ర మహాపాత్రో రచించిన పుస్తకాన్ని జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ఈ పుణ్య భూమిని స్వతంత్ర ఉత్కళ రాష్ట్రంగా ఏర్పాటుకు మహారాజు కృషి చేశారన్నారు. సిద్ధాంత సాహిత్య అనుష్టాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అతిథులుగా ప్రొ.సుబ్రాంసు కుమార్ బెహరా, ఆశిష్ మహంతి, బిబ్రత్ కుమార్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఒడిస్సీ నృత్య కళాకారిణి తనీషా బెబర్తా, భరతనాట్యంలో బల్లికానా కంసికాలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఎమ్మెల్యే రామచంద్ర కడమ్‌కు అధిష్టానం పిలుపు



పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయిక్‌తో రామచంద్ర కడమ్ తదితరులు

జయపురం: కొరాపుట్ జిల్లా పొట్టంగి అసెంబ్లీ నియోజకవర్గంలో విజయం సాధించిన కాంగ్రెస్ సీనియర్ నేత రామచంద్ర కడమ్‌కు రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానం నుంచి శనివారం పిలుపు రావడంతో ఆయన భువనేశ్వర్ వెళ్లారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అత్యవసర సమావేశంలో కడమ్ పాల్గొన్నారని, ఆయనతో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయిక్ చర్చలు జరిపినట్లు సమాచారం. ముఖ్యంగా ఈ చర్చలు ఎమ్మెల్యే కడమ్‌ను శాసన సభలో కాంగ్రెస్ పక్ష నేతగా చేసేందుకు జరిగినట్లు తెలిసింది. పీసీసీ ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకుందని, కేవలం జాతీయ పార్టీ ఆమోదం కోసం వేచి ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. చర్చల్లో రాష్ట్రంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి సమైఖ్యంగా పని చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కొరాపుట్ జిల్లాలో రామచంద్ర కడమ్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. అతను 1995లో పొట్టంగి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 2009లో మరోసారి గెలిచారు. ఆయన ఎమ్మెల్యేగా లేకపోయినా పార్టీని బలోపేతం చేసేందుకు శాయశక్తులా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థి ప్రఫుల్ల పంగిని ఓడించారు.

ఘాట్ రోడ్డులో కారు బోల్తా

- ఇద్దరికి తీవ్రగాయాలు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి మంత్రిఅంబ ఘాట్‌లో శుక్రవారం రాత్రి కారు బోల్తాపడడంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రాయిఘర్ గ్రామానికి చెందిన రాజా లుకు తన బంధువుతో కలిసి మల్కన్‌గిరి జిల్లా మత్తిలిలో ఉంటున్న వేరే బంధువుల ఇంటికి వెళ్లాడు. అనంతరం మత్తిలి నుంచి తిరిగి తమ గ్రామానికి వస్తుండగా విజయవాడ–రాంచీ 326వ జాతీయ రహదారిలో మంత్రిఅంబ ఘాట్‌లో కారు అదుపు తప్పి, 15 అడుగుల లోతుకు జారిపడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కారు ప్రమాదం సమాచారం అందిన వెంటనే బొయిపరిగుడ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మంత్రిఅంబ ఘాట్ ప్రమాదాల గుట్టగా మారిందని, అభివృద్ధికి నోచుకోకపోవడం వలన ఈ ఘాట్‌పై తరుచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ మార్గాన్ని అభివృద్ధి చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని అభిప్రాయపడుతున్నారు.



ఘాట్ రోడ్డులో బోల్తాపడిన కారు

నైరుతి రుతు పవనాల ఆగమనం



రుతు పవనాల పురోగతి చిత్రం

భువనేశ్వర్: నైరుతి రుతుపవనాలు శనివారం రాష్ట్రానికి చేరాయి. మల్కన్‌గిరి జిల్లాలోని కొన్ని ప్రాంతాలను రుతు పవనాలు తాకినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఐఎండీ ముందస్తు అంచనా కంటే ముందుగా నైరుతి రుతు పవనాలు రాష్ట్రానికి చేరడం విశేషం. రుతు పవనాల రాకతో మల్కన్‌గిరి, పరిసర జిల్లాలతో సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.

ముందస్తు ఆగమనం

రుతు పవనాలు సాధారణంగా ఏటా జూన్ 12 నాటికి ఒడిశాలోని దక్షిణ ప్రాంతాల్లోకి వస్తాయి. ఈసారి నాలుగు రోజుల ముందుగానే రాష్ట్రాన్ని తాకాయని స్థానిక వాతావరణ కేంద్రం డైరెక్టర్ మనోరమ మహంతి తెలిపారు. గత ఏడాది జూన్ 22న, అంతకు ముందు 2022లో జూన్ 16న రుతు పవనాలు రాష్ట్రానికి విచ్చేశాయి. వాతావరణ నిపుణుల ప్రకారం ఇటీవల సంభవించిన తీవ్రమైన తుఫాను రీమల్ రుతు పవనాల పురోగతికి సహాయపడి రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చేందుకు పరిస్థితులు అనుకూలించాయని సమాచారం. మల్కన్‌గిరి ప్రాంతాన్ని చల్లబరిచిన నైరుతి రుతు పవనాలు త్వరలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని అనుబంధ వర్గాలు తెలిపాయి.

రాజధానిలో ఉక్కపోత

ఇదిలా ఉండగా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌తో సహా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వేడి మరియు తేమతో కూడిన వాతావరణం నెలకొంది. ఉక్కపోతతో ప్రజానీకం అల్లాడుతోంది. నైరుతి రుతుపవనాల రాక కోసం వీరంతా నిరీక్షిస్తున్నారు.

• కొత్త ప్రభుత్వంలోనైనా కష్టాలు తప్పేనా..?



రెండు దశాబ్దాలకు పైగా రాష్ట్రంలోని బీజేడీ ప్రభుత్వంలో జిల్లాలోని కొండల్లో నివసిస్తున్న ప్రజలు సరైన రహదారి సౌకర్యాలు, మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడ్డారు. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలతో త్వరలో రాష్ట్రంలో నూతన బీజేపీ ప్రభుత్వం కొలువుదీరనుంది. దీంతో ఇప్పటికైనా తమ కష్టాలు తీరుతాయని ప్రజలు ఆశాభావంతో ఉన్నారు. సదరు సమితిలోని నకిటి పంచాయతీ పరిధి తుండా, ఉలక తుండా గ్రామాలు మౌలిక సౌకర్యాలకు దూరంగా ఉన్నాయి. సరైన రహదారి లేక ఇక్కడి ప్రజలు అనునిత్యం నరకం అనుభవిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం కోసం సుమారు 5 కిలోమీటర్లు కాలి నడకన కొండలు దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అత్యవసర వైద్యం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో కొత్త ప్రభుత్వం తమ కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

– రాయగడ

మిలెట్ ప్రాసెసింగ్ యూనిట్ సందర్శన



ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తివాసన్

జయపురం: కొరాపుట్ జిల్లా పెమిలిగుడ సమితి రాజుపుట్ గ్రామ పంచాయతీలోని మిలెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తివాసన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాసెసింగ్ యూనిట్‌లో పనిచేస్తున్న వర్కర్లతో యూనిట్‌లో సమస్యలు, ఉత్పత్తి మొదలగు విషయాలపై చర్చించారు. మిషన్ శక్తితో నిర్వహించబడుతున్న యూనిట్‌లో సమస్యలపై దృష్టి కేంద్రీకరించి యూనిట్ విస్తరణ, అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు సర్పంచ్ పితాంబర కిరసాని తదితరులు ఉన్నారు.

కూలిన మల్కన్‌గిరి ఎయిర్‌పోర్టు గోడ



కూలిన ఎయిర్‌పోర్టు గోడ



కూలిన గోడను పరిశీలిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో గొడిగూడ గ్రామం వద్ద ఫిబ్రవరిలో ఎయిర్‌పోర్టును ప్రారంభించిన విషయం తెలిసిందే. అక్కడ ఇటీవల నిర్మాణంలో ఉన్న గోడ కూలడంతో మరమ్మతులు చేశారు. కాగా శుక్రవారం రాత్రి కురిసిన గాలివానకు మరోసారి ఎయిర్ పోర్టు గోడ కుప్పకూలింది. దీంతో జిల్లా యంత్రాంగం నాణ్యమైన సామగ్రి ఉపయోగించకపోవడం వలనే గోడ కూలుతోందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కూలిన గోడను అధికారులు శనివారం పరిశీలించారు. మరోవైపు అధికంగా వర్షం పడితే ఎయిర్ పోర్టు లోపలి భాగంలో స్లాబ్ నుంచి వాటర్ కారుతున్నట్లు తెలుస్తోంది.



ఎయిర్‌పోర్టు లోపల స్లాబ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

ఆధునిక సౌకర్యాలతో 'టైజర్'



టైజర్ కారును ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం హసీబ్

శ్రీకాకుళం అర్బన్: ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టయోటోకు చెందిన సరికొత్త సౌకర్యాలతో మార్కెట్‌లోకి వచ్చిన అద్భుత వాహనం అర్బన్ క్రూయిజర్ టైజర్ అని భారతీయ స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఏఏ హసీబ్ అన్నారు. శనివారం శ్రీకాకుళం పెద్దరోడ్డులోని టయోటో కంపెనీ షోరూం వద్ద శనివారం సరికొత్త టైజర్ కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు ప్రారంభ ధర రూ.7.73 లక్షలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఫైనాన్స్ స్కీంలు, ఓనర్‌షిప్, మెయింటెనెన్స్ ప్యాకేజీలు, ఎక్స్చేంజ్ ప్రయోజనాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోడీ టయోటో ఉపాధ్యక్షుడు పి.బి.ఆచారి, సేల్స్ జనరల్ మేనేజర్ విశ్వేశ్వర రావు, షోరూం సర్వీస్ మేనేజర్ తాండ్ర చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో పర్తియాత్ర



సెంట్రల్ ట్రస్టీ రత్నాకర్‌తో జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాకు చెందిన సత్యసాయిబాబా భక్తులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 21వ పర్తియాత్రకు సంబంధించి సెప్టెంబరు 21, 22, 23 తేదీల్లో అనుమతి లభించిందని జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావులను కోరగా అనుమతించారని పేర్కొన్నారు. జిల్లాలో జరుగుతున్న నిత్య నారాయణసేవలు, వైద్యసేవలు, సంస్కృతి, సంప్రదాయాలు, పండగల విశిష్టతను తెలియజేసేలా బాలవికాస్ తరగతులు నిర్వహించడంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని కొనియాడరని తెలిపారు. కార్యక్రమంలో సేవా సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆప్షన్ల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన పాలిసెట్ -2024 కౌన్సెలింగ్‌లో భాగంగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి కాగా ఆప్షన్లు ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 10 వరకు ప్రక్రియ కొనసాగునుంది. వెబ్ కౌన్సెలింగ్ విధానంలో తమకు నచ్చిన కళాశాలలు, బ్రాంచ్‌ల కోసం విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. సాంకేతిక విద్యాశాఖ షెడ్యూల్ మేరకు ఈ నెల 11న ఆప్షన్ల మార్పుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 13న సీట్లు, కళాశాలల ఎలాట్‌మెంట్ ప్రకటిస్తారు. సీట్లు లభించిన విద్యార్థులు ఈ నెల 14 నుంచి 19 మధ్య కళాశాలల్లో చేరవచ్చు. క్లాస్‌వర్కు మాత్రం 14 నుంచే ప్రారంభించనున్నారు.

వృద్ధుడికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని రైతుబజారు ఎదురుగా తిరుమల ఆస్పత్రి వద్ద ఓ వృద్ధుడిని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు చెప్పిన వివరాల మేరకు.. పొందూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన గార శ్రీనివాసరావు తన గ్రామానికి చెందిన వ్యక్తి నగరంలోని తిరుమల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని శుక్రవారం పరామర్శకు వెళ్లాడు. తిరిగి బయటకు రాగా చినబజారు నుంచి బైక్‌పై వస్తున్న ఓ యువకుడు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని వెంటనే 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఆ ద్విచక్ర వాహనాలు ఏమైనట్లు?

టెక్కలి రూరల్: టెక్కలి పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు నెలలు క్రితం ద్విచక్ర వాహనాల (టీవీఎస్ ఎక్స్‌ఎల్) కేసు కొలిక్కి రాలేదు. మూడు నెలలుగా కేసును పరిశోధన చేసి దోషులను మాత్రం ఇంతవరకు అరెస్ట్ చేయలేదు. ఈ ఏడాది మార్చి 30న టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనం చోరీ జరిగిన విషయం తెలిసిందే. అక్కడ సీసీ ఫుటేజ్ ఆధారంగా వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులో తీసుకుని విచారించగా వారు ఇచ్చిన సమాచారం మేరకు సుమారు 17 టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు అదుపులో ఉన్న వాహనాలు ఎవరివి..? ఎవరి నుంచి స్వాధీనం చేసుకున్నారు..? అన్న దానిపై ఇంతవరకు పోలీసులు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. స్వాధీనం చేసుకున్న 17 వాహనాలు ఒకే కంపెనీకి చెందినవి కావడంతో అంతర్యం అంతు చిక్కడం లేదు. ఈ వాహనాలు కూడా ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా త్వరలోనే సమాచారం ఇస్తామని పేర్కొన్నారు.

వీడని ఉత్కంఠ

- ఖరారవ్వని ఒడిశా కొత్త ముఖ్యమంత్రి
- మరో 2 రోజులు ఆగండి: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సామల్



మీడియాతో మాట్లాడుతున్న మన్మోహన్ సామల్

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు వచ్చి నాలుగు రోజులు గడిచాయి. అయినప్పటికీ భారతీయ జనతా పార్టీ కొత్త ముఖ్యమంత్రి పేరును ఇంకా ప్రకటించకపోవడంతో ఉత్కంఠ బిగుసుకుని ఉంది. ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ శనివారం మీడియాతో మాట్లాడుతూ మరో రెండు రోజులు వేచి ఉండాలని సూచించారు. న్యూఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన సందర్భంగా భువనేశ్వర్ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడిన మన్మోహన్ సామల్ బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ముఖ్యమంత్రిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఢిల్లీ పర్యటన విషయాలపై ఆయన మాట్లాడుతూ ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ నేత, లోక్‌సభ నాయకుడి ఎన్నికకు హాజరయ్యేందుకు వెళ్లినట్లు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన ఎంపీలందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఇతర పార్టీ కార్యక్రమాలకు కూడా హాజరైనట్లు వివరించారు.

జూన్ 10న ప్రమాణ స్వీకారం

జూన్ 10న భువనేశ్వర్‌లో జరిగే బీజేపీ మంత్రివర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ, కొత్త కేంద్ర కేబినెట్ మంత్రులు, చాలా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని మన్మోహన్ సామల్ తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను సమన్వయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను చేయడంలో భాగస్వాములు అందరూ ఉన్నారని ఆయన తెలిపారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం తేదీని నిర్ణయించలేదని లేదా దాని గురించి తనకు తెలియజేయలేదని ఆయన అన్నారు. మరో రెండు రోజులు వేచి ఉండండి, రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిపై పార్టీ నిర్ణయం గురించి మీకు తెలియజేస్తామని పేర్కొన్నారు. కేంద్రంలో పార్టీకి ఎంతో అనుభవం ఉన్న నేతలు ఉన్నారని, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటారన్నారు. తనను ఈ పదవికి పరిగణనలోకి తీసుకున్నారా అనే ప్రశ్నకు తాను రేసులో లేనని, దాని కోసం ఆశించడం లేదని బదులిచ్చారు. తనకు అప్పగించిన ఏ బాధ్యతనైనా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో 78 స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా 147 మంది సభ్యుల రాష్ట్ర శాసన సభలో బీజేపీ ఆధిక్యత సాధించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఏర్పాటుకు ఢోకా లేని బలంతో స్థిరపడింది. భారతీయ జనతా పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్నికలకు వెళ్లడం విశేషం. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో తన ఎన్నికల ప్రచారంలో భూమిపుత్ర అయిన ముఖ్యమంత్రి అభ్యర్థిని పార్టీ ఎంపిక చేస్తుందని, జూన్ 10న భువనేశ్వర్‌లో ప్రమాణ స్వీకారం చేస్తారని మోదీ సభాముఖంగా ప్రకటించారు.

ప్రభుత్వాస్పత్రి పరిశీలన



రోగుల సమస్యలు తెలుసుకుంటున్న మంగు ఖీలో

మల్కన్‌గిరి: జిల్లా ప్రభుత్వాస్పత్రిని చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో శనివారం పరిశీలించారు. రెండు రోజులు క్రితం ఆయన పాముకాటుకు గురవ్వడంతో అస్వస్థతకు గురయ్యారు. శనివారం డిశ్చార్జి అవ్వడంతో ఆస్పత్రిలో పర్యటించి వైద్య సౌకర్యాలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎటువంటి ఆహారం ఇస్తున్నారో తెలుసుకున్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం వైద్యుల కొరతను భర్తీ చేస్తామన్నారు.



ఆస్పత్రిలో ఆహారాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఖీలో

మొక్కలతోనే జీవరాశి మనుగడ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

జయపురం: మొక్కలతోనే జీవరాశి మనుగడ ముడిపడి ఉందని బొరిగుమ్మ ఏడీపీ దీక్షిత్ కుమార్ నాయిక్ అన్నారు. జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి జిలిమిలి గ్రామంలో వరల్డ్ విజన్ ఇండియ ఆధ్వర్యంలో వృక్షరోపన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవులు కనుమరుగు అవుతుండడంతో పర్యావరణం క్షీణిస్తూ ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. అలాగే భూ సంరక్షణ, పారిశుద్ధ్య పరిరక్షణ ఎంతో అవసరమన్నారు. అనంతరం విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వరల్డ్ విజన్ సంస్థ మీడియ కో-ఆర్డినేటర్ ఆవేద వీర, రుబి పండ, ఖండపాన్, అక్షయ హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కలశ యాత్ర



కలశ యాత్రలో పాల్గొన్న మహిళలు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలోని రాజువీధిలో విఘ్నేశ్వరుని ఆలయం శిఖర ప్రతిష్ట సందర్భంగా వందలాది మంది మహిళలతో కలశ యాత్ర శనివారం నిర్వహించారు. ముందుగా మహిళలు ర్యాలీగా కొరాపుట్-నబరంగ్‌పూర్ జిల్లాలను విడదీస్తున్న ఇంద్రావతి నదీతీరంకి చేరుకున్నారు. వేద పండితులు పూజలు చేసి మహిళలకు కలశాలు అందజేశారు. అనంతరం ర్యాలీగా మహిళలు ఊరేగింపు నిర్వహించారు. ఈనెల 11వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీకి చెందిన సంతుస్ కుమర్ పాత్రో ప్రకటించారు.

వెంకన్నకు విశేష అలంకరణ



శ్రీకాకుళం చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారిని తులసిమాలలతో అలంకరణ చేశారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. ఉత్సవ మూర్తులకు కూడా ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన లారీ క్లీనర్ మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన లారీ క్లీనర్ సుప్రజిత్ సాహిన్ (38) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. నవభారత్ ఫ్లై ఓవర్‌పై విశాపట్నం వైపు వెళుతున్న లారీని ఓవర్ టెక్ చేసే క్రమంలో వెనుక నుంచి వెళుతున్న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో క్యాబిన్‌లో కూర్చున్న క్లీనర్ తీవ్రంగా గాయపడగా, శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. డ్రైవర్ ప్రదీప్ కుమార్ బెహరా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరిది ఒడిశా రాష్ట్రం. అక్కడి నుంచి విశాఖపట్నం లోడుతో వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటికి చేరిన వైద్యుడు అమ్లాన్



ఎస్పీ కార్యాలయంలో తల్లిదండ్రులతో అమ్లాన్

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఆరోగ్య కేంద్రం వైద్యుడు అమ్లాన్ కుమార్ బోయి శనివారం ఇంటికి చేరుకున్నాడు. ఆయన గత ఆదివారం రాత్రి నుంచి కనిపించకుండాపోయిన విషయం తెలిసిందే. అయితే బుధవారం అమ్లాన్ కర్ణాటకలో ఉన్నట్లు ఎస్పీకి సమాచారం రావడంతో మల్కన్‌గిరి నుంచి ఒక పోలీసు బృందం కర్ణాటక వెళ్లి మల్కన్‌గిరికి శనివారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పుల భారం వలనే వెళ్లినట్లు తెలియజేశారు. దీంతో అతడిని మందలించి తల్లిదండ్రులకు అప్పగించారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త!

- ఎరువులు కొనుగోలులో అప్రమత్తత అవసరం
- కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు
- గుర్తింపు పొందినవే మేలంటున్న అధికారులు



ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన రైతు

హిరమండలం: తొలకరి సాగుకు సర్వం సిద్ధమైంది. పుడమి పుత్రులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే సమయం ఆసన్నమైంది. ఈ తరుణంలో నకిలీ విత్తనాలు, ఎరువులు అంటకట్టేందుకు కొన్ని ప్రైవేటు కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆకర్షణీయ ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఏమార్చుతున్నాయి. కొందరు ఏకంగా డీలర్లకు ప్యాకేజీలు, విదేశ టూర్లు సైతం ఆఫర్లు చేస్తున్నారు. రైతులను ఆకట్టుకునేలా వాహనాల్లో వచ్చి కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, మైక్‌సెట్లు ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే నకిలీ విత్తనాలు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. ఈ తరుణంలో రైతులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తగా పరిశీలించాలి..

కంపెనీల ప్రకటనలు, ప్రచారాలకు ఆకర్షితమై విత్తనాలు కొనుగోలు చేస్తే మోసపోయే అవకాశముంది. ఆకర్షనీయమైన ప్యాకింగ్‌తో గుర్తింపు లేని లేబుల్‌తో కొన్ని కంపెనీలు నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నాయి. కంపెనీల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నీ సరిచూసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. ప్రభుత్వ నిబంధనల వివరాలు ఉన్నాయో లేవో జాగ్రత్తగా పరిశీలించాలి.

విత్తనాల ఎంపిక ఇలా..

- వ్యవసాయశాఖ లైసెన్సులు పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లుపై విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు, విక్రయదారుని సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు సరి చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనరాదు.
- విత్తన ప్యాకెట్ సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదా నిర్ధారించుకోవాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకూ భద్రపరచాలి.
- మొలకెత్తే, పూత దశలో ఉన్నప్పుడు పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు ఎలా కొనాలంటే ..

- అధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే తీసుకోవాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీలు ఉందో లేదో పరిశీలించాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారుపేరు ఉంటేనే కొనాలి. చిల్లులు పడిన ఎరువుల బస్తాలను కొనవద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.

పురుగు మందులు కొనేముందు..

- వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగు మందులు కొనుగోలు చేయాలి.
- పురుగుమందు డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలంరంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి.
- పురుగుమందులు రెండు మూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలను, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి.
- పురుగుమందుల వాడకానికి వినియోగించే పాత్రలను ఇతర అవసరాలకు వినియోగించవద్దు.


నఖిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మెట్టూరులో షాపులో వరి విత్తనాల నమూనాలు సేకరిస్తున్న కొత్తూరు ఏఓ శ్రీనివాసరావు

కొత్తూరు: విత్తన అధీకృత వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని కొత్తూరు మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని మెట్టూరులో ఓ ప్రైవేటు ట్రేడర్స్ వద్ద వరి విత్తనాలు నమూనాలు శనివారం సేకరించారు. వీటిని తిరుపతిలోని కోడింగ్ కేంద్రానికి పరీక్షల కోసం పంపించినట్లు చెప్పారు. విత్తన పరీక్షలో ఎటువంటి తేడాలు వచ్చినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మండలానికి 1507 క్వింటాళ్ల వరి విత్తనాలు రాయితీపై మంజూరైనట్లు చెప్పారు. వీటిని రైతు భరోసా కేంద్రాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులకు 90 శాతం రాయితీపై 420 క్వింటాళ్ల విత్తనాలు అందిస్తున్నామన్నారు. ప్రైవేట్ వర్తకులు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తనిఖీల్లో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మవద్దు



ప్రభుత్వ లైసెన్సు కలిగిన డీలర్ల వద్దే నాణ్యమైన విత్తనాలు కనుగోలు చేయాలి. కొన్న విత్తనాల రసీదులను రైతుల వద్ద భద్రపర్చుకోవాలి. నకిలీ విత్తనాలు కొనిమోసపోవద్దు. దళారులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దు. ఎక్కడైనా ఇబ్బంది ఎదురైతే అధికారులను సంప్రదించాలి.

– బి.సంధ్య, వ్యవసాయశాఖాధికారి, హిరమండలం

చంటిబిడ్డలకు ఎంత కష్టం..!

కాశీబుగ్గ : మండుటెండలో చిన్నారులు నరకయాతను అనుభవిస్తున్నారు. చంటిబిడ్డలని కూడా చూడకుండా.. నిండు గర్భిణులతో సైతం యాచన చేయిస్తున్నారు. వాస్తవంగా యాచక వృత్తిలో ఉన్నవారు చేస్తున్నారో.. లేక వీరి వెనుక ముఠా ఉందో తెలియదు గానీ అధిక ఉష్ణోగ్రతల నడుమ వాహనాల కాలుష్యం మధ్య ప్రమాదకరంగా రైలు పట్టాలను దాటుతూ వాహనాలు ఎక్కుతూ దిగుతూ పసి పిల్లలను వెంటపెట్టుకుని యాచన చేస్తున్న తీరు హృదయ విదరకంగా ఉంటోంది. కాశీబుగ్గ ఎల్‌సీ గేటు సమీపంలో పంటపొలంలో గుడారాలు వేసుకుని గేటు వేయగానే ఇట్టే వాలిపోతున్నారు. ఉదయం పది గంటలకు ప్రారంభమవుతున్న వీరి దినచర్య సాయంత్రం నాలుగు గంటల వరకు నిరాటంకంగా కొనసాగుతోంది. రైలు గేటు ప్రతి అరగంటకు రెండు సార్లు వేస్తుండటం ఒక్కోసారి సుమారు 30 నిమిషాల సమయం పడుతుండటంతో వీరికి అవకాశంగా మారింది.

ఈ విషయమై జిల్లా హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు సదాశివుని కేశవరావు వద్ద ప్రస్తావించగా అటువంటి వారిని అరెస్టు చేసి చిన్నారులను కాపాడి చిల్డ్రన్ హోంకు తరలిస్తామని చెప్పారు. పలాస, కాశీబుగ్గ పరిధిలో ఏఎస్ఐ గణపతిరావును చైల్డ్ వెల్ఫేర్ పోలీసు ఆఫీసర్‌గా నియమించి చంటిబిడ్డలకు రక్షణకల్పించి వసతి భోజన సౌకర్యాలు ప్రభుత్వం తరఫున అందిస్తామని తెలిపారు.



కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద చిన్నారితో కలిసి యాచిస్తున్న మహిళ

జీడిపప్పు అక్రమ రవాణా!

కాశీబుగ్గ: జీఎస్టీ, మార్కెట్ యార్డు అనుమతులు లేకుండానే కొందరు జీడిపప్పును అక్రమంగా తరలిస్తున్నారు. ప్రైవేటు బస్సుల్లో దర్జాగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఎక్కువగా పలాస నుంచి విశాఖకు గుట్టు తరలిస్తున్నారు. 60 కేజీలకు సంబంధించిన వేబిల్లులు, ఇతర అనుమతులు చూపించి టన్నులకొద్దీ జీడిపప్పును ప్రైవేటు బస్సులో అక్రమ రవాణా చేస్తున్నారు. విశాఖ, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నుంచి పలాసకు ప్రయాణించే సుమారు 20 ప్రైవేటు బస్సుల్లో రహస్యంగా ఈ వ్యవహారం నడుస్తున్నట్లు సమాచారం. విశాఖకు చేరిన వెంటనే అక్కడి నుంచి వివిధ రాష్ట్రాలకు తరలిస్తారు. కొందరు అధికారులకు నెలవారి మామూళ్లు చేరుతుండటంతో ఈ విషయంలో చూసీ చూడనట్లు విడిచిపెడతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలాస కోసంగిపురం జాతీయ రహదారి వంతెన వద్ద నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో సైతం ఇలా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కాశీబుగ్గ బస్టాండ్ నుంచి ప్రైవేటు బస్సులో తరలిపోతున్న జీడిపప్పు బస్తాలు

క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

పూసపాటిరేగ : మండలంలోని చంపావతి నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై ఎ. సన్యాసినాయుడు తెలిపారు. ట్రాక్టర్లను శనివారం సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా


మద్దిల వాసు

నెల్లిమర్ల: రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిల వాసు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మారిన దృష్ట్యా తన పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు. రాజీనామా లేఖను సంబంధిత అధికారులకు పంపించినట్లు తెలిపారు. పదవీ కాలంలో తనకు సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నూతిలో పడి వ్యక్తి మృతి


నూతిలో నాగేశ్వరరావు మృతదేహం

మక్కువ: మండలంలోని ఎస్.పెద్దవలస గ్రామానికి చెందిన వడ్డి నాగేశ్వరరావు (53) నూతిలో పడి మృతి చెందిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై పి.నరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్.పెద్దవలస గ్రామంలో ఈనెల 6వ తేదీన నాగేశ్వరరావు బంధువుల వివాహం జరిగింది. రాత్రి వరకు నాగేశ్వరరావు పెళ్లివేడుకలో సందడిగా గడిపారు. 7వ తేదీ తెల్లవారుజాము నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు వెతకసాగారు. పక్క గ్రామమైన పాతకామునివలస సమీపంలోని నూతిగట్టుపై నాగేశ్వరరావు దుస్తులు ఉండడంతో అనుమానం వచ్చి నాగేశ్వరరావు కుమారుడు చంటి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించినప్పటికీ, ఎటువంటి ఆనవాలు కనిపించలేదు. శనివారం ఉదయం నూతిలో మృతదేహం తేలియాడుతున్న విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో పోలీసులుకు సమాచారం అందించారు. ఎస్సై నరసింహమూర్తి మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రైలు కింద పడి...


తెంటు భరత్ (ఫైల్)

పార్వతీపురం టౌన్: రైలు కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఇన్‌చార్జ్ రత్నాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పార్వతీపురం పట్టణం బూరాడవీధికి చెందిన తెంటు భరత్ (31) ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని దాలియుడువలస రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతుండగా పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీ కొనడంతో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి పంపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్ఞానాపురం రైల్వే స్టేషన్ సమీపంలో వ్యక్తి మృతి


లంకాడ నరేష్ మృతదేహం

మర్రిపాలెం (విశాఖ జిల్లా) : విశాఖలోని జ్ఞానాపురం రైల్వేస్టేషన్ గేట్ నంబర్ 4 సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించారు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా అందులో ఒక నంబర్‌కు ఫోన్ చేయగా మృతుడు విజయనగరానికి చెందిన లంకాడ నరేష్‌గా గుర్తించారు. మూడు రోజుల క్రితం ఓ పెళ్లికని వచ్చాడని పోలీసులు తెలిపారు. అయితే రైలు ఎక్కబోతు ప్రమాదవశాత్తు జారిపడ్డాడా, లేదా మరే ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం మృతదేహం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, మృతుడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియల్సి ఉందని వారు తెలిపారు. సీఐ ఎస్. భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చదువు భారం..



- తల్లిదండ్రులకు గుదిబండగా మారుతున్న ఫీజులు
- మరికొద్ది రోజుల్లో పునఃప్రారంభం కానున్న పాఠశాలలు
- ఇప్పటికే పుస్తకాల పేరిట హడావిడి చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు
- ప్రతి ఏడాదీ పెరుగుతున్న చదువుల ఖర్చులు

విజయనగరం: వేసవి సెలవులు ముగియనున్నాయి. మరో వారంలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఏటా పెరుగుతున్న ఫీజులు, పుస్తకాల ధరలు చూసి పేద, మధ్య తరగతి ప్రజలు భయపడుతున్నారు. బ్యాగ్, పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టు, బూట్లు వంటి ధరలు కూడా ఎప్పటికప్పుడు పెరిగిపోతున్నాయి. జూన్ వచ్చిందంటే చాలు విద్యార్థుల తల్లిదండ్రులు హడలెత్తిపోతున్నారు. పట్టణాల్లోనే కాకుండా మారుమూల గ్రామాల్లోని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లోనే చదివించాలని పట్టుదలతో ఉంటున్నారు. పిల్లలకు ఐదు సంవత్సరాలు దాటగానే ఏ పాఠశాలలో వేయాలి? ఎక్కడ బాగుంటుంది? మా అబ్బాయి పదో తరగతి పాసయ్యాడు.. ఏ కళాశాలలో జాయిన్ చేయాలి? అనే అంశాలపైనే చర్చించుకుంటున్నారు. అందుకు అవసరమయ్యే వస్తువులను ఇబ్బంది పడుతూనే కొనుగోలు చేస్తున్నారు.


విక్రయాలకు సిద్ధంగా ఉన్న పుస్తకాలు



వామ్మో జూన్....

సామాన్య, మధ్య తరగతి ప్రజలకు జూన్ నెల వచ్చిందంటే ఎక్కడలేని భయం. విద్యార్థులను పాఠశాలలకు పంపించడంతో పాటు రైతులు సాగు ప్రారంభించేందుకు డబ్బులు చూసుకోవాలి. దీంతో ఈ నెలలో ఖర్చులు తడిసి మోపెడవుతుంటాయి. మార్కెట్‌లో విద్యార్థులకు కావాల్సిన బ్యాగ్‌లు, బూట్లు, పుస్తకాలు, ఆటో, బస్ చార్జీలు వంటి వాటితో చుక్కలు కనపడుతున్నాయి. ఆదాయం తక్కువగా ఉన్న మధ్య తరగతి కుటుంబాలకు ఈ నెల పెనుసవాల్‌గా మారింది. పాఠశాలలో కనీస సౌకర్యాలు ఎలా ఉన్నా ఫీజులు మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఎల్‌కేజీలో చేర్పించాలంటే తక్కువలో తక్కువగా రూ.7 వేల నుంచి 10 వేల రూపాయల వరకు ఫీజు చెల్లించాల్సిందే. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు టెస్టు, వర్క్, నోట్ పుస్తకాలకు కనీసం ఐదు వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. అంతే కాకుండా యూనిఫాం, టీ షర్టులకు కూడా వేలల్లోనే ఖర్చవుతోంది.

చదువులు భారమవుతున్నాయి:

పోటీ ప్రపంచంలో పిల్లల చదువులు రోజురోజుకూ భారమవుతున్నాయి. చిన్నపాటి స్కూల్‌లో చేర్పించాలన్నా వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. అదే కాస్త పేరున్న స్కూల్‌లో చదివించాలంటే రూ. లక్షలు కట్టాల్సిందే. ఇవి కాకుండా పుస్తకాలు, దుస్తులు, బస్సు ఫీజులు అదనపు ఖర్చులు. దీంతో జూన్ నెల వచ్చిందంటే బడ్జెట్‌లు తారుమారవుతున్నాయి. పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులుగా ఖర్చు చేస్తున్నాం.

– ఎస్.మల్లికార్జున రావు,
విద్యార్థి తండ్రి, విజయనగరం.

దుకాణాలు కిటకిట..

విద్యార్థులకు అవసరమయ్యే వస్తువుల కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. స్టేషనరీ, రెడీమేడ్ దుస్తులు, చెప్పుల షాపులు విద్యార్థుల తల్లిదండ్రులతో కళకళలాడుతున్నాయి. పలు ప్రైవేట్ పాఠశాలలయితే తమ వద్దనే పుస్తకాలు కొనుగోలు చేసేలా పుస్తక షాపుల యజమానులతో ఒప్పందం కుదుర్చుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా బ్యాగులు రూ.200 నుంచి రూ.1000, రెండు జతల స్కూల్ డ్రస్సులతో పాటు వైట్ డ్రస్సు ఒక జత, టీషర్టు ఒకటి కలిపి తక్కువలో తక్కువగా రూ. 4 వేల వరకు ఉంటున్నాయి. ఈ ఖర్చులు తల్లిదండ్రులకు గుదిబండలా మారాయి.

గర్భిణుల వసతిగృహం పరిశీలన


గర్భిణుల వసతిగృహం వద్ద మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు

సాలూరు: పట్టణంలోని వైటీసీలో గల గిరిశిఖర గర్భిణుల వసతిగృహాన్ని కేంద్ర వైద్య బృంద అధికారులు సుదర్శన్ భగత్, సాలేస్ శాన్యాల్ శనివారం పరిశీలించారు. వసతిగృహంలో అందిస్తున్న సదుపాయాలు, ఆరోగ్య పరిస్థితి, తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం పాచిపెంట మండలంలోని పసుకువలస, మంచాడవలస గ్రామాలను సందర్శించారు. ప్రిజమ్ - 10లో భాగంగా గిరిజన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ, హెచ్‌బీ పరీక్షలు, తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే సామూహిక సీమంతం, అన్నప్రాసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివకుమార్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ అనిల్, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాల్, వైటీసీ మేనేజర్ సాగర్, ఐసీడీఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే చీఫ్ డీటీఐ సీహెచ్‌వీ రమణ, తదితరులు

- చీఫ్ డీటీఐ సీహెచ్‌వీ రమణ

విజయనగరం టౌన్: రైలు ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చీఫ్ డీటీఐ సీహెచ్‌వీ రమణ సూచించారు. ఇంటర్నేషనల్ లెవిల్ క్రాసింగ్ అవేర్‌నెస్ డే పురస్కరించుకుని శనివారం స్థానిక వీటీ అగ్రహారం సమీపంలో ఉన్న రైల్వే లెవిల్ క్రాసింగ్ వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే క్రాసింగ్‌లు దాటే సమయంలో ప్రయాణికులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గేట్ కింద నుంచి దూరి వెళ్లడం సరికాదని సూచించారు. లెవిల్ క్రాసింగ్‌లు దాటినప్పుడు చెవిలో ఇయర్ ఫోన్ పెట్టుకుని వెళ్లడం మంచిది కాదని హితవు పలికారు. కార్యక్రమంలో చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్స్ ఆర్‌ఆర్.కుమార్, సీహెచ్ శ్రీధర్‌రావు, జి.జగన్నాథం, పి. గోవింద ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత ప్రమాణాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు


రింగ్ రోడ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్

విజయనగరం: లిక్విడ్ నైట్రోజన్ ఉపయోగించే బిస్కెట్స్‌తో నోరు, గొంతు, అన్నవాహిక, కడుపులో తీవ్రమైన గాయాలు, శ్వాస తీసుకోవడంలో సమస్యలు తలెత్తి ప్రాణాపాయ సమస్యలు తలెత్తుతాయని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నాగుల్ మీరా హెచ్చరించారు. పట్టణంలోని రింగురోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ఫుడ్ కోర్టులను శనివారం ఆయన సందర్శించి అక్కడి ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లిక్విడ్ నైట్రోజన్ శరీరంలోకి వెళ్లడం వల్ల ఆక్సిజన్ అందక మనిషి ఉక్కిరిబిక్కిరి అవుతారన్నారు. స్మోక్ బిస్కెట్స్ తినవద్దని సూచించారు. స్మోక్ బిస్కెట్స్ విక్రయిస్తున్న స్టాల్‌ను సీజ్ చేశారు. అనంతరం బజ్జీ స్టాల్స్‌ను తనిఖీ చేశారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేశారు. ఎక్కువ సార్లు మరిగించిన నూనెతో మంచూరియా, బజ్జీలు వేయించడం వల్ల క్యాన్సర్, గుండె సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హోటళ్లు, ఫుడ్ కోర్టుల్లో ఆహార భద్రత ప్రమాణాలు పాటించనట్లయితే వినియోగదారులు 8790603489 ఫోన్‌కు సమాచారం అందించాలని, తనిఖీలు నిర్వహించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నేత్ర వైద్యసేవలపై సమీక్ష సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు

పార్వతీపురం టౌన్: స్థానిక జిల్లా ఆస్పత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ సుకుమార్‌బాబు ఆధ్వర్యంలో జిల్లాలో నేత్ర పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ, తదితర అంశాలపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో చేపట్టిన సేవలు, భవిష్యత్‌లో చేయాల్సిన పనులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు 26,000 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 14,109 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించినట్లు తెలిపారు. అలాగే 1890 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్యాధికారులు, సహాయకులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి, సహాయకులు పాల్గొన్నారు.

సెంచూరియన్ విద్యార్థి ప్రతిభ


తల్లిదండ్రులతో కలిసి చైతన్యను సత్కరిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

- రూ. 50 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపిక
- విద్యార్థిని సత్కరించిన వర్సిటీ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో బీటెక్ పూర్తి చేసిన కుసుమంచి చైతన్య అరుదైన ఘనతను సాధించాడు. నెదర్లాండ్స్‌కు చెందిన ప్లాంట్ నెట్‌వర్క్ సంస్థలో రూ.50 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించాడు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో బీటెక్ పూర్తి చేసిన చైతన్య కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు. ఈ మేరకు చైతన్యను వర్సిటీ ఆవరణలో శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ, కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సన్నీడియోల్, డాక్టర్ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలతో 'చిటుక' నివారణ

- చిటుక రోగంపై నిర్లక్ష్యం తగదు
- పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి
- పశు సంవర్ధక శాఖాధికారులు

రామభద్రపురం: జీవాలకు ఆశించే చిటుక రోగంపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. ఈ రోగం ఆశిస్తే జీవాలు నిమిషాల్లోనే మృత్యువాత పడతాయి. వ్యాధి ఆశించిన చిటుకలో చనిపోతాయి కాబట్టే ఈ వ్యాధికి చిటుక రోగం అంటారు. జిల్లాలో సుమారుగా 1,30,180 గొర్రెలు, 43,101 మేకలున్నాయి. వీటికి చిటుక వ్యాధి సోకుండా, అలాగే నివారణకు ప్రభుత్వం ఇప్పటికే టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. టీకాలు కార్యక్రమం మొదలైన నేపథ్యంలో గొర్రెల్లో ఈ వ్యాధి ఎప్పుడు వస్తుంది..?, లక్షణాలు ఎలా ఉంటాయి..?, నివారణ పద్ధతులపై పశుసంవర్ధక శాఖాధికారులు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

సులభంగా వ్యాపిస్తుంది..

గొర్రెలు, మేకలకు గాలికుంటు, మశూచి, పీపీఆర్, చిటుకు రోగం, దొమ్మ, గొంతువాపు, మొదలైన అంటువ్యాధులు తొందరగా సోకుతాయి. ఒక మంద నుంచి వేరొక మందకు అత్యంత వేగంగా, సులభంగా వ్యాపించి ప్రాణ నష్టాన్ని కలిగిస్తాయి. చాలా సందర్భాల్లో చికిత్స చేసేందుకు తగిన వ్యవధి కూడా ఉండదు. ఇలాంటి ప్రమాదకరమైన ప్రాణాంతకమైన వ్యాధులకు చికిత్స బదులు నివారణే శ్రేయస్కరమని గుర్తించాలి. అంటువ్యాధులు సోకక ముందే ఈ వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే గొర్రెలు, మేకల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

లక్షణాలు..

రాత్రి బాగా ఉండి తెల్లారే సరికల్లా ఎక్కువ సంఖ్యలో జీవాలు మరణిస్తుంటాయి. కళ్ల ముందే ఎలాంటి లక్షణాలు లేకుండా హఠాత్తుగా గాలిలోకి చెంగున ఎగిరి కిందపడి ఆకస్మాత్తుగా మరణిస్తాయి. జ్వరం, పళ్లు కొరకడం, వణకడం, బిగుసుకునిపోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, చెట్లకు గట్టిగా తలను ఆనించి ఉండడం, కాళ్లు బిగిసిపట్టి నడవడం, శ్వాస కష్టమవడం మొదలగు లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రత దశలో అధిక విరేచనాలు, కడుపునొప్పి, మందకొడిగా ఉండడం, మేత సరిగ్గా తినకపోవడం వంటి లక్షణాలుంటాయి.


రామభద్రపురం పొలాల్లో గొర్రెల మంద

నివారణ ఇలా...

- వ్యాధి రాకుండా ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అకాల వర్షాలు, తొలకరి వర్షాలకు పెరిగిన గడ్డిని ఎక్కువగా మేపరాదు.
- వరి కోసిన తర్వాత మిగిలిన క్రరలను ఎక్కువగా మేపరాదు. గొర్రెలు, మేకలకు మూడు నెలలకోసారి నట్టల నివారణ మందు వేయాలి.
- 30 రోజుల వయసున్న గొర్రె, మేక పిల్లలకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. మూడు నెలల తర్వాత బూస్టర్ డోస్ వేయించాలి. గొర్రెలు, మేకలకు ఆరు నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. గొర్రె పిల్లలు అత్యధికంగా పాలు తాగకుండా గమనించాలి.


తారాపురంలో చిటుక రోగం నివారణ టీకాలు వేస్తున్న పశుసంవర్ధకశాఖ సిబ్బంది

- పాలు తాగే స్థితి నుంచి ఒకేసారి దాణాకు మార్చకుండా క్రమ క్రమంగా మార్చుకుంటూ వెళ్లాలి.
- మేకలకు పూర్తిగా పప్పు జాతి పశుగ్రాసాలు వేయరాదు.

గొర్రెలకు ఎక్కువగా సోకే ప్రమాదం..

ఈ వ్యాధి మేకలకన్నా గొర్రెలకు ఎక్కువగా సోకే ప్రమాదం ఉంది. తొలకరిలో పెరిగిన పచ్చికను అతిగా మేయడం వల్ల శరీరంలో ఎప్సిలాన్ అనే విష పదార్థం విడుదల కావడం వల్ల ఈ వ్యాధి ఆశిస్తుంది.

మన్యంకు జ్వరమొచ్చింది


సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లు


రక్త పరీక్షల గది వద్ద రోగులు

- ఆరంభమైన ఎపిడమిక్ సీజన్
- ముసురుకుంటున్న వ్యాధులు
- వైరల్, టైఫాయిడ్ కేసుల నమోదు
- కిటకిటలాడుతున్న ఏజెన్సీ పీహెచ్‌సీలు
- పెరుగుతున్న ఇన్‌పేషెంట్లు

సీతంపేట: మన్యంలో ఎపిడమిక్ సీజన్ ఆరంభమైంది. అధిక ఉష్ణోగ్రతలు, అడపాదడపా కురిసే వర్షాలు, కలుషితమైన నీటితో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు ఏజెన్సీలో జ్వరాలు విజృంభిస్తాయి. ఈ ఏడాది కూడా జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఏజెన్సీలోని అన్ని పీహెచ్‌సీలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వైరల్, టైఫాయిడ్ జ్వరపీడితులకు వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. అక్కడక్కడా మలేరియా, డయేరియా కేసులు సైతం నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

పెరుగుతున్న ఓపీ నమోదు

మారుమూల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం రోజుకు 50 నుంచి 70 వరకు ఓపీ నమోదవుతోంది. వీరిలో అధిక మంది జ్వరాలతో బాధపడేవారే ఉంటున్నారు. ఏరియా ఆస్పత్రుల్లో సైతం 200లకు పైగా కేసులు నమోదవుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా వైరల్, టైఫాయిడ్ జ్వరాలు అధికమవుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రక్త పరీక్షల్లో 60 శాతం టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఈ నెలలో జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నట్లు వైద్యులే చెబుతున్నారు. ఇప్పుడే ఈ తరహా జ్వరాలు ఉంటే రానున్న మరో నెలరోజులు ఇంకా వర్షాలు పడితే జ్వరపీడితుల సంఖ్య పెరుగుతుందని వైద్యసిబ్బంది అంచనా వేస్తున్నారు.

ఏప్రిల్, మేనెలల్లో ఏజెన్సీలో కొండలపై ఉన్న గ్రామాల్లో బోర్లు, బావులు అడుగంటడంతో కొండకోనల్లో ఎక్కడో ఉన్న ఊటజలాలను గిరిజనులు తాగుతుండడంతో టైఫాయిడ్ వంటి జ్వరాలు అధికంగా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. దోనుబాయి, మర్రిపాడు, కుశిమి, సీతంపేట, కడగండి, పొల్ల, దోనుబాయి తదితర పంచాయతీల పరిధిలోని గిరిజన గూడల్లో జ్వర పీడిత కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

చాపకిందనీరులా మలేరియా వ్యాప్తి

ఏజెన్సీలో మలేరియా కేసులు కూడా అక్కడక్కడా నమోదవుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం మలేరియా కేసులు తగ్గాయని జిల్లా మలేరియా నివారణ అధికారులు తెలియజేస్తున్నా చాప కింద నీరులా మలేరియా వ్యాప్తి చెందుతోంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 50కి పైగా మలేరియా కేసులు నమోదైనట్లు మలేరియాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. 2022లో 236 2023లో 264 మలేరియా పాజిటివ్ కేసులు నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. అయితే, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసుల సంఖ్య వీటికి అదనం. వర్షాకాలంలో నీరు నిల్వ ఉన్నచోట మలేరియాకు కారణమయ్యే ప్లాస్మోడియం పరాన్నజీవి ఆడ ఎనాఫిలిస్ దోమ వృద్ధి చెంది జ్వరాల వ్యాప్తికి కారణమవుతోందని వైద్యులు చెబుతున్నారు.